

సిఎం, ఎన్ఆర్‌సిపై ఎందుకు వ్యతిరేకించలేదు

కడప అర్బన్: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సిఎఎ, ఎన్ఆర్‌సిని ఎందుకు వ్యతిరేకించలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు, డిప్యూటీ మాజీ మేయర్ అరిఫుల్లా ప్రశ్నించారు. గురువారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ధి పొందడానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నల్లచట్టాలను ఎప్పటికీ వ్యతిరేకమని, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, జగన్మోహన్ రెడ్డి నల్లచట్టాలను వ్యతిరేకించకపోతే ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నల్లచట్టాలను అమలు కాకుండా చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో సిఎం జగన్మోహన్ రెడ్డి ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయమని చెప్పి ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. ముస్లిం మైనారిటీలంతా కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఓటు ద్వారా తమ మద్దతు తెలిపి, ఈ నల్లచట్టాలను వ్యతిరేకించాలని కోరారు.

రెండో విడతలో టిడిపి అభ్యర్థులు వీరే!

- కమలాపురానికి పుత్తా చైతన్యరెడ్డి
- ప్రొద్దుటూరుకు వరదరాజులరెడ్డి
- మదనపల్లికి షాజహాన్‌బాషా
- జమ్మలమడుగు, బద్వేల్ మిత్రులకేనా?



వరదరాజులరెడ్డి పుత్తా చైతన్యరెడ్డి షాజహాన్‌బాషా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైఎస్ఆర్ జిల్లాలోని కమలాపురం, ప్రొద్దుటూరు స్థానాలకు రెండో విడతగా గురువారం టిడిపి అభ్యర్థులను ఖరారు చేసింది. మొదటి విడతలో కడప, మైదుకూరు, పులివెందుల అసెంబ్లీ స్థానాలకు పేర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా విడుదల చేసిన కమలాపురం, ప్రొద్దుటూరు స్థానాలతో కలిపితే ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు అవుతోంది. విభజిత కడప జిల్లాలోని కడప, మైదుకూరు, పులివెందుల, ప్రొద్దుటూరు, కమలాపురం, జమ్మలమడుగు, బద్వేల్ స్థానాల్లో మూడు వంతుల స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు అవుతోంది. మిగిలిన జమ్మలమడుగు, బద్వేల్ అసెంబ్లీ స్థానాల్లో మిత్రులైన బిజెపి, జనసేనకు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా విడుదల చేసిన కమలాపురం అసెంబ్లీ బరిలో కొత్త అభ్యర్థిని అన్వేషించింది. 2009 నుంచి 2019 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పుత్తా నరసింహారెడ్డి బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. వరుసగా మూడు ఓటముల పాలైన అభ్యర్థులను పక్కన పెట్టాలని టిడిపి అధిష్టానం ప్రకటించిన సంగతి తెలిసిందే. కమలాపురం అసెంబ్లీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి స్థానంలో ఆయన కుమారుడు పుత్తా చైతన్యరెడ్డి పేరును ప్రకటించారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి కేటాయించింది. ఈయన ఆరు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం, బలమైన కేడర్‌ను కలిగి ఉన్న నేపథ్యంలో టికెట్ కేటాయించినట్లు తెలుస్తోంది. టికెట్ రేసులో చివరి వరకు హోరాహోరీగా తలపడిన మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, యువ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అనుచరుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఏదేమైనా ప్రొద్దుటూరు బరిలో వైసిపి అభ్యర్థికి ధీటైన అభ్యర్థిని టిడిపి నిలపడంతో హోరాహోరీ పోరాటం తప్పదనే వాదన వినిపిస్తోంది. అన్నమయ్య జిల్లాలో మొదటి విడతలో రాయచోటి, తంబళ్లపల్లి, పీలేరు టికెట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. తాజాగా రెండవ విడత కింద విడుదల చేసిన జాబితాలో మదనపల్లి టిడిపి టికెట్ షాజాహాన్‌బాషాకు కేటాయించింది. మదనపల్లి టికెట్ ఆశావహులుగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, బాబూరెడ్డి చివరికి వరకు నిలిచిన సంగతి తెలిసిందే. తాజా విడతలో సిట్టింగ్ ఎమ్మెల్యే సోదరుడైన షాజహాన్‌బాషాకు టికెట్ కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు వైసిపి మొండిచేయి చూపించిన నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కుటుంబీకునికి టిడిపి టికెట్ ఇవ్వడంతో మదనపల్లి రాజకీయం ఆసక్తికరంగా మారింది.

బిజెపి దమనకాండ నశించాలి

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకుల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

రైతుల పట్ల నరేంద్రమోడీ ప్రభుత్వం నిరంకుశత్వం, కర్కషంగా వ్యవహరిస్తోందని, ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని ఎపి రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రైతు ఉద్యమం పట్ల కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని నిరసిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు, కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా గతంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం విఫలం చెందిందని పేర్కొన్నారు. అందుకు నిరసనగా రెండో విడత ఢిల్లీ రైతాంగం శాంతియుతంగా ఢిల్లీకి పోతుంటే బిజెపి ప్రభుత్వం రైతుల పట్ల కాల్పులు జరిపి పోలీసులచే దాడి చేయించి రైతు శుభ్ కరణ్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం బలితీసుకుందన్నారు. రైతు ఉద్యమం పట్ల నరేంద్ర మోడీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని వారు తీవ్రంగా ఖండించారు. గత రైతు ఉద్యమ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాత పూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా రైతులు పండించే అన్ని పంటలకు డాక్టర్ .ఎం.ఎస్.స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని, ఒక పర్యాయం పంటరుణాలను మాఫీ చేసి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో పెట్టిన విద్యుత్ బిల్లు 2020ను ఉపసహరించుకోవాలని, గత రైతు ఉద్యమ సందర్భంగా మరణించిన అమరవీరుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని తెలిపారు. రైతు ఉద్యమంలో రైతునాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం ఢిల్లీకి వచ్చి శాంతియుతంగా నిర్వహిస్తున్న ప్రదర్శనపై కానూరి సరిహద్దులో హర్యానా పోలీసులు సాగించిన దుర్మార్గమైన దాడిలో 24 సంవత్సరాల శుభ్ కరణ్ సింగ్ అనే రైతు ఉద్యమకారుడు తీవ్రమైన గాయాలపాలై మృతి చెందాడని తెలిపారు. రైతు ఉద్యమం పట్ల బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గమైన వైఖరికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. యువ రైతు మృతికి కారణమైన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టి అన్నదాతలను ఆత్మహత్యలు చేసుకునే విధంగా బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ బహుళ జాతి కంపెనీలకు దాసోహం అయిందని తెలిపారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమాన్ని చర్చలు జరిపి రైతాంగం ఆందోళనను విరమించే విధంగా కృషి చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, రైతు, కార్మిక సంఘాల జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బాదుల్లా, మదిలేటి, మనోహర్ రెడ్డి, శంకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్ర రెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వినయ్‌కుమార్, నరేంద్ర, దస్తగిరి, మున్నా, రమేష్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాల సమన్వయ సమితి, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఇల్లూరు కృష్ణారెడ్డి పాల్గొని నిరసన తెలిపారు.



కడప ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

బిసి భవన్‌లో ప్రొటోకాల్ రగడ

- ఎమ్మెల్సీ పేరు లేదని గందరగోళం
- పూర్తికాకుండానే ప్రారంభోత్సవం
- శిలాఫలకంలో బిసిల పేర్లు గల్లంతు
- మోకాలడ్డిన వారికి అగ్రస్థానం
- భవన కృషీవలురకు నిరాదరణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బిసిభవన్ ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ రగడ నెలకొంది. శిలాఫలకంలో ఎమ్మెల్సీ రమేష్ కుమార్‌యాదవ్ పేరు లేకపోవడం, జిల్లాలోని బిసి కార్పొరేషన్ ఛైర్మన్లు నలుగురు ఉండగా ఏ ఒక్కరి పేరూ లేకపోవడం విమర్శలకు దారి తీసింది. బిసిభవన్ శిలా ఫలకంలో రెడ్డి సామాజికవర్గ నాయకుల పేర్లు ఉండడం, బిసి నాయకుల పేర్లు లేకపోవడంతో బిసి భవన్ ప్రారంభోత్సవమా కాదా అనే చర్చకు దారితీసింది. ఇదిలాఉండగా రెండేళ్ల కిందట ఓల్డ్ రిమ్స్ ప్రాంగణంలో బిసి భవన్ నిర్మాణానికి 25 బిసి కులాలకు చెందిన నాయకులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి సహకరించాలని కోరారు. దీనికి ఆయన స్పందించి బిసి భవన్ నిర్మాణానికి స్థల సేకరణలో కలెక్టర్ సహాయాన్ని తీసుకున్నారు. కడప మేయర్ జిజిహెచ్ సమీపంలో ఎక్కువ విస్తీర్ణంలో భవనాన్ని ఏర్పాటు చేయాలని చూశారు. సదరు జిజిహెచ్ సమీప స్థలాన్ని నిరాకరించిన బిసి సంఘాల నాయకులు ఖాదర్‌బాషా, లింగమూర్తి, కల్యా సుధాకర్, గోవింద నాగరాజు, జయశ్రీ తదితర మహిళా నాయకులు దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ ఓ.రసూల్ సహకారంతో ఎంపీని కలిసి ఓల్డ్ రిమ్స్‌లో 20 సెంట్ల స్థల కేటాయింపునకు ఆమోదం తీసుకున్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో రూ.5.70 కోట్ల నిధులతో కూడిన నాలుగు అంతస్థుల భవన్ నిర్మాణం చేపట్టారు. బిసి భవన్ పూర్తిస్థాయి నిర్మాణానికి మరో రెండు నెలలు సమయం తీసుకునే అవకాశం ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బిసి భవన్ నిర్మాణ పనుల్ని పూర్తి చేయకముందే ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేయడం విస్మయాన్ని కలిగించింది. బిసి భవన్ నిర్మాణానికి ఎటువంటి కృషి చేయని నాయకులు ప్రొటోకాల్ పేరుతో శిలా ఫలకంపై పేర్లు వేయించుకోవడానికి ఎగబడడం చర్చనీయాంశంగా మారింది. స్థలం ఎంపిక దగ్గర నుంచి భవన నిర్మాణం వరకు పాటు పడిన 25 కులాలకు సంబంధించి బిసి నాయకులకు తగిన ప్రాధాన్యత లేకపోవడం చర్చకు దారి తీసింది.

వైసిపి ప్రభుత్వంలోనే బిసిలకు న్యాయం

ప్రజాశక్తి - కడప



బిసి భవన్ ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే బిసిలకు న్యాయం జరిగిందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డి, నగర మేయర్ కె సురేష్ బాబు, ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, ఎం రామచంద్రారెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు .గురువారం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత రిమ్స్‌లో నూతనంగా నిర్మించిన బిసి భవన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ బిసి భవన్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. బిసి భవనం నగరంలో ఉండాలనే ఉద్దేశంతో ఎంపీ పట్టుబట్టి స్థలానికి కేయించారని చెప్పారు. బిసి భవనంలో ఒక గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీ మాట్లాడుతూ బిసిల చిరకాల కోరిక అన్నిటికి నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇంకా కొన్ని చిన్నచిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పూర్తి చేసి ఏప్రిల్ నెలాఖరులోగా నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, జడ్‌పి వైస్ ఛైర్మన్ బాలయ్య యాదవ్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, ఇఇ ప్రభాకర్ నాయుడు, డిఇ కళ్యాణి, ఎఇ శ్రీహరి, కార్పొరేటర్లు, నాయకులు బంగారు నాగయ్య యాదవ్, ఇతర బిసి కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు కృషి : జడ్జి

కడప : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని, ఆడ పిల్లల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా వైద్య, ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ నాగరాజు అధ్యక్షతన పిసి పిఎన్‌డిటిపై సంబంధిత అధికారులతో డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైసరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ ఆడబిడ్డను రక్షించుకోవాలంటే ఎక్కడా కూడా లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా చేయాలన్నారు. గర్భస్రావాలు జరగకుండా ఆపాలని, అందుకోసం ప్రజల్లో విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ వర్కర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రధాన భాగస్వామ్యం కల్పించాలన్నారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ జిల్లాలో మూడు నెలల్లో 75 బాల్య వివాహాలు అడ్డుకుని అందుకు సహకరించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేశామన్నారు. చెప్పారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, పిసి పిఎన్‌డిటి సభ్యుల, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, దిశ పోలీసు అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది, భారత రత్న మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి జాతిపిత మార్క్స్ : సిపిఎం

బద్వేలు : సమస్త కార్మిక వర్గానికి ఏకైక జాతిపిత కార్ల్‌మార్క్స్ అని సిపిఎం పట్టణ నాయకులు ముడియం చిన్ని పేర్కొన్నారు. గురువారం మార్క్స్ 142 వర్ధంతి సందర్భంగా స్థానిక సుందరయ్య భవనంలో చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మిక వర్గానికి దిశా నిర్దేశం చేసి వ్యక్తి కార్ల్‌మార్క్స్ అన్నారు. కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారి వర్గం ఎలా దోచుకుంటుందో పేద దేశాలను సామ్రాజ్యవాద దేశాలు ఎలా తమ గుప్పెట్లో పెటుకుంటాయో అనేక అంశాలు 185 సంవత్సరాల కిందటే దాస్ క్యాపిటల్ ద్వారా రచించారని చెప్పారు. ప్రపంచంలో పెట్టుబడిదారి వర్గాన్ని కూల్చి కార్మిక వర్గం రాజ్యాధికారం ఎలా సాధించాలో ఆయన ఎప్పుడో సూచించారని పేర్కొన్నారు. నేడు కార్మిక వర్గం ఆయన చూపిన బాటలోనే నడుస్తున్నాయని వారు తెలిపారు. లెనిన్, స్టాలిన్, మావో, చేగువేరా చావిజ్ ఇలాంటి ప్రపంచ గుర్తింపు పొందిన నేతలు ఆయన చూపిన బాటలోనే నడిచారరని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొండయ్య, గంగనపల్లి నాగార్జున, బాల గురవయ్య, ఆంజనేయులు, ఓబుల్ రెడ్డి, ఎం నరసింహులు, రాయప్ప, శివ పాల్గొన్నారు.

అశోక్ నగర్‌లో టిడిపి బ్యానర్లు చించివేత

కడప అర్బన్ : కడప నగరంలోని అశోక్ నగర్‌లో టిడిపి బ్యానర్ల చించివేతను ఆ పార్టీ కార్యకర్తలు. అభిమానులు అడ్డుకున్నారు. గురువారం చోటు చేసుకున్న సంఘటనపై టిడిపి కడప అసెంబ్లీ అభ్యర్థి ఆర్ మాధవి రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కడపకు మాత్రమే వచ్చిందా అని ప్రశ్నించారు. ఏపీలో ఎన్నికల కోడ్ ఇంకా రాకముందే కడపకు మాత్రమే వచ్చినట్టు ఎక్కడ పడితే అక్కడ టిడిపి బ్యానర్లు చించివేయడం సరికాదన్నారు. టిడిపి బ్యానర్ల ప్రచారానికి కార్పొరేషన్‌కు డబ్బులు చెల్లించామని పేర్కొన్నారు. కమిషనర్ డిప్యూటీ సిఎం అంజాద్ బాషా ప్రోద్బలంతో సచివాలయ సిబ్బందిచే తమ పార్టీ బ్యానర్లు చింపి, సున్నం వేశారని తెలిపారు. ఇలాంటి చర్యలు చేయడం అధికార దుర్వినియోగానికి పాల్పడమే అన్నారు. తాము టిడిపి బ్యానర్లు కట్టుకుంటే కార్పొరేషన్‌లో పనిచేసే నాగేంద్ర అనే వ్యక్తి కింది స్థాయి ఉద్యోగిని బెదిరించి, కొట్టి బ్యానర్లను చింపి వేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ టిడిపికి మాత్రమే వచ్చిందా, మీ పార్టీలకు లేదా అని ప్రశ్నించారు.

ముస్లిం మైనార్టీలకు పెద్దపీట

కడప అర్బన్ : గతంలో ముస్లిమ్ మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేసి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని కాంగ్రెస్ నాయకులు, సంఘసేవకులు సలావుద్దీన్ పేర్కొన్నారు. గురువారం ఆయన నగరంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నగరంలోని బుచ్చాల్ స్ట్రీట్ నురాని మసీదు వద్ద ముస్లిం మైనార్టీలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టిడిపి, జనసేన, వైసిపి, బిజెపి ఓట్ల కోసం కుల రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. కడప నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే 'ఇబిసి నేస్తం' లక్ష్యం

కడప అర్బన్ : పేద మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఇబిసి నేస్తం లక్ష్యమని జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె బహిరంగ సభ నుంచి వీడియో కాన్ఫిరెన్సు ద్వారా 3వ విడత 'ఇబిసి నేస్తం' లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేల సాయం మొత్తాన్ని జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి డిఆర్ఒతోపాటు జిల్లా బిసి కార్పొరేషన్ ఇడి జయసింహ హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం స్థానిక విసి హాలులో ఇబిసి నేస్తం పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 34,145 మంది అగ్రవర్ణ పేద మహిళలకు 3వ విడతగా మంజూరయిన రూ. 51,21,75,000ల మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి డిఆర్ఒలబ్ధిదారులకు అందజేశారు. అర్హత ఉండీ లబ్ది చేకూరడంలో ఇంకనూ ఏమైనా సమస్యలు ఉంటే సంబంధింత శాఖ అధికారులను లేదా స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి, మైనారిటీ సంబంధిత సంక్షేమ శాఖాధికారులు, లబ్దిదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసూయ చెందేలా అభివృద్ధి పనులు

కడప : గత ప్రభుత్వాలు, నాయకులు అసూయ చెందేలా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తున్నారని డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక పాలంపల్లె, రూకవారిపల్లెలో స్థానిక కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్డు, 3 డ్రైన్ కాలువలకు ఉప ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా నగరాభివృద్ధికి రూ.2400 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కడప నగరంలో అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ముందుకెళ్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించి మళ్లీ దీవెనలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు మాసీమ బాబు, స్థానిక కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, ఇతర కార్పొరేటర్ షేక్ మొహమ్మద్ షఫీ, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, పాలంపల్లె శేఖర్, శీను, రమేష్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలి

కడప అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్ కోరారు. గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని మాసాపేట కొత్త కొట్టాలు లో ఉన్న ఏలీము ప్రార్థన మందిరం లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాస్టర్లందరికీ గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొత్తగా చర్చీల నిర్మాణం కోసం 5 సెంట్లు స్థలం కేటాయించాలని తెలిపారు. క్రైస్తవుల పై జరుగుతున్న దాడుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావాలని తెలిపారు. క్రైస్తవుల వివాహాలు, సమావేశాలు జరుపు కొనేందుకు నగరం లో ప్రత్యేక భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ కె. ఫిలిప్, జైభీమ్ మాల సేన అధ్యక్షుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ మల్లె కొండు సంపత్ కుమార్, టిడిపి నగర కార్యదర్శి జలతోటి జయకుమార్, వివిధ చర్చీలకు చెందిన పాస్టర్లు, సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

కడప : రామాంజనేయ పురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం మహిళా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు కుటుంబ, మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. మెయింటినెన్స్ చట్టాలు, గృహహింస, పౌర, క్రిమినల్ చట్టాలు, వరకట్న మరణం, యాసిడ్ దాడి, కిడ్నాప్, అపహరణ, అత్యాచారం, లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, పిఎన్ డిటి చట్టం, డొమెస్టిక్ వైలెన్స్ చట్టం, వంటి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది జి.శ్రీదేవి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. శాంత పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు కట్టుదిట్టం : జెసి

వేంపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఇడుపులపాయకు వస్తున్న సందర్భంగా అక్కడ ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న ఏర్పాట్లను జెసి, ఎస్‌పి సిద్దార్థ్ కౌశిల్ పరిశీలించారు. ఇపులపాయలోని వైఎస్ఆర్ గెస్ట్‌హౌస్, హెలిప్యాడ్, వైఎస్ఆర్ ఘాట్‌ను పరిశీలించారు. ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులకు జెసి సూచించారు. ఏర్పాట్లపై అధికారులకు, సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. బందోబస్తు కూడా కట్టుదిట్టంగా ఉండాలని ఎస్‌పి పోలీసులు అధికారులకు సూచించారు. సిఎం జగన్ ఇడుపులపాయలోని వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులు అర్పించిన అనంతరం 175 నియోజకవర్గాలకు చెందిన వైసిపి అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో పులివెందుల ఓఎస్‌డి అనిల్‌కుమార్ రెడ్డి, రోడ్డు భవనాల శాఖ ఇఇ సిద్దారెడ్డి, పులివెందుల ఆర్డీవో వెంకటేష్, పులివెందుల డిఎస్పీ వినోద్ కుమార్, సిఐ గోవిందురెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలి : టిడిపి

కడప అర్బన్ : విద్యార్థి, యువత ఓటుతో రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ద్వారకా నగర్‌లో తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ అధ్యక్షతన టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అర్హత లేని ప్రజా ప్రతినిధులు, స్వార్థపరులు అధికారంలో ఉండడం వల్లే విద్యా వ్యవస్థ సర్వనాశనం అయిందన్నారు. 117 జీవోను తీసుకువచ్చి 3,4,5 తరగతుల పాఠశాలల విలీనం ద్వారా జిల్లాలో 515 ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారన్నారు. కమీషన్ కోసం బైజుస్ అని అప్పుల్లో ఉన్న సంస్థను తీసుకువచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ప్రచారా ఆర్భాటంలో భాగంగా గ్రామంలో రంగు రంగుల గోడలు ఉన్నాయో తప్ప అందులో చదువు చెప్పే టీచర్లు లేంన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి

కడప : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిదని, పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం స్థానిక తన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌క్రింద 12 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 21. 26 లక్షల మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆరోగ్యశ్రీని కొనసాగిస్తూ ప్రాణదాతగా మారారని తెలిపారు. అనంతరం లబ్దిదారులు కె.అబ్దుల్, వై. వెంకట సాయి, ఎం. నరసింహులు, రావి నరసింహారావు, వి.నగరత్నమ్మ, ఎస్. జైబున్నిసా, బి. విజయ్ భాస్కర్, షేక్ నజీర్ బాషా, రవి శంకర్, ఏ. శేషయ్య, వి.హేమ చంద్రా రెడ్డి, ఫర్హాత్ అంజూమ్‌కు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, సుబ్బారాయుడు, మధువర్ధన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బండి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న సిఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి : ఎంపీ

ప్రజాశక్తి-కాశినాయన /కలసపాడు

రాబోవు ఎన్నికలలో మళ్లీ ముఖ్యమంత్రిగా మన జగనన్నను ఎన్నుకుంటేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని కడప ఎంపీ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు గురువారం మండల పరిధిలోని కొండ్రారాజుపల్లె గ్రామ పంచాయతీ సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన వైసిపి బద్వేల్ అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాల వల్ల ప్రతి కుటుంబమూ లబ్ధి పొందిందని చెప్పారు. సమన్వయకర్త విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **3 వేల ఎకరాలకు నీరందించాం : ఎంపీ** లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా మండలానికి మూడు వేల ఎకరాలకు నీరందించామని ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రూ. 7 కోట్ల నిధులతో తెల్లబాడు, రామావరం తణుకు చెరువు వరకు తెలుగు గంగ కాలువ నుంచి పైప్‌లైన్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని మళ్లించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, యువ నాయకుడు ఆదిత్య రెడ్డి, సురేష్ నాయుడు లిఫ్ట్ ఇరిగేషన్ ఎస్ఇ ఇఇ, డిఇ, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

భర్తీ చేసిన ఉద్యోగాలపై విచారించాలి


కడప అర్బన్ : 2022 లో భర్తీ చేసిన గ్రూప్ -1 ఉద్యోగాలపై సిబిఐతో విచారించాలని నిరుద్యోగ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జడ్‌పి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2018 గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షను రద్దు చేసి ఉద్యోగాల్లో ఉన్న 162 మందిని తొలగించమని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ నియామక ప్రక్రియ పైన పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని జెఎసి రాష్ట్ర కన్వీనర్ షేక్. సిద్దిక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. 49 వేల ఒఎంఆర్ షీట్లను వైసిపి ప్రభుత్వం మార్చి అంగట్లో సరుకులు అమ్మినట్లు ఉద్యోగాలను అమ్ముకున్నది మండిపడ్డారు. ఎపిపిఎస్‌సి ఛైర్మన్, సభ్యులను సిబిఐ లాంటి సంస్థతో విచారించి నిజానిజాలను నిగ్గుతేల్చాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం హెచ్చరించారు. కార్యక్రమంలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కడప అర్బన్ : యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర రావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, కడప ఆధ్వర్యంలో సాయి కృప నర్సింగ్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో సింహ భాగం యువత ఉన్నపటికీ కేవలం 2.8 శాతం మంది మాత్రమే పార్లమెంట్‌లో ఉన్నారని పేర్కొన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రభుత్వాలను ఏర్పాటు చేసి చట్టసభలలో వెళ్లి చట్టాలను రూపొందించాలి తెలిపారు. స్టెప్ సిఇఒ సాయి గ్రేస్ మాట్లాడుతూ యువత రాజకీయాలలోకి రావాలని, కేవలం వృత్తి పరమైన విద్యనే కాకుండా చట్టసభలలో అడుగు పెట్టి చట్టాలను చేయాల్సిన బాధ్యత యువత పై ఉందని పేర్కొన్నారు.

సైనిక్ ఫలితాల్లో 'దిన్నెపాటి బసిరెడ్డి వికాస్' ప్రభంజనం

చింతకొమ్మదిన్నె : ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో దిన్నె పాటి బసిరెడ్డి కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 16 మంది రాత పరీక్షలు రాసి అర్హత సాధించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ దిన్నెపాటి బసిరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బసిరెడ్డి వికాస్ స్కూల్ నుంచి 16 మంది విద్యార్థిని విద్యార్థులు అర్హత సాధించగా, వీరిలో బాల గురువర్ధన్ రెడ్డి 300 మార్కులకు గాను మార్కులు 222 తెచ్చుకుని టాపర్‌గా నిలిచాడన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో స్కూల్స్ ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ విజయం ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులదే అని ఆయన తెలిపారు. విద్యార్థుల విజయం పట్ల సంస్థ కో-ఆర్డినేటర్ శివకళ హర్షం వ్యక్తం చేశారు, అనంతరం విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దిన్నెపాటి బసిరెడ్డి

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహరీ
శుక్రవారం (సా)	శనివారం (ఉ)
6.30	5.07



భూమిపూజ కార్యక్రమంలో వైఎస్ మనోహర్‌రెడ్డి

ఆంజనేయస్వామి గుడి పునర్నిర్మాణం

- రంగనాథస్వామి దేవస్థానంలో కోనేరు, షెడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని పాతసంత మార్కెట్ ఆంజనేయస్వామి గుడి పునర్నిర్మాణానికి సంబంధించి గురువారం భూమిపూజ కార్యక్రమాన్ని గ్రూప్ ఆఫ్ టెంపుల్ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ ఇన్చార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జేసిఎస్ కన్వీనర్లు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, అంకాలమ్మ గుడి చైర్మన్ బ్యాటరీల ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వారికి ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారిని సత్కరించారు. ఆంజనేయ స్వామి గుడి పునర్నిర్మాణానికి భూమిపూజ చేశారు. పట్టణంలోని రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న రంగనాథ స్వామి నూతన రథాన్ని రూ.56 లక్షలతో తయారు చేసేందుకు భూమిపూజ చేశారు. దేవస్థానంలో పెళ్లిళ్లు చేసుకునేందుకు షెడ్లకు రూ.40 లక్షలు మంజూరు చేశారు. షెడ్లను ప్రారంభించారు. గుడిలో మరుగుదొడ్లు, భోజనశాలకు రూ.20 లక్షలు మంజూరు కావడంతో పనులు పూర్తయిన వాటిని ప్రారంభించారు. రంగనాథస్వామి గుడిలో డివైడర్ లైట్లు రూ.52 లక్షల 60,000 పనులు పూర్తి కావడంతో వాటిని ప్రారంభించారు. రూ.60 లక్షలతో కోనేరు నిర్మాణం పూర్తి కావడంతో వాటిని కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో ఇఒ రమణ, పాలకమండలి సభ్యులు మాధవాచారి, కాంబోజి మల్లికార్జున, సోమేశ్వరమ్మ, చంద్రావతి, వాణి, సూర్యలక్ష్మి, రాజశేఖర్, మురళి, ప్రశాంత్, సంపత్, రాజా, దశరథ రామిరెడ్డి, చక్రధర ఆచారి, సోపాల వీర, నాయకులు పాల్గొన్నారు.

అయ్యవారిపల్లెలో రామాలయ నిర్మాణానికి ..

చాపాడు : మండల పరిధిలోని అయ్యవారిపల్లెలో సీతారామాలయం నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. టిటిడి సహకారం రూ.10 లక్షలతో నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో అయ్యవారిపల్లి ఎంపిటిసి రమాదేవి, వైసిపి నాయకులు మాధవరెడ్డి, వెంకటసుబ్బయ్య, శివప్రసాద్, థామస్, నాళ్ళగారి వెంకటసుబ్బయ్య, వెంకటరాముడు, రాజు, శ్రీను, సుబ్బారాయుడు, జయరాముడు, రఘు, వీరయ్య, పాములేటి, లక్ష్మయ్య, అంజి, చంద్ర, ఫ్రాన్సిస్, ఆలయ అభివృద్ధి కమిటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖాజీపేట : మండలం పరిధిలోని ఆంజనేయ కొట్టాలు పంచాయతీ కొత్త పుల్లూరు ఎస్సీ, ఎస్టీ కాలనీలో రామాలయానికి గురువారం సర్పంచ్ గోపిరెడ్డి పెద్దిరెడ్డి భూమిపూజ చేశారు. గతంలో ఆలయ ఏర్పాటుకు ఇచ్చిన హామీ మేరకు కార్యక్రమం చేపట్టామన్నారు. నాయకులు ఉదయభాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, రవీంద్రరెడ్డి, సచివాలయం కన్వీనర్ గుమ్మా సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రేపు స్వామి వారి కల్యాణం..

మండలంలోని పత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్సమేత శిఖర, ధ్వజ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

వేలంలో రూ.65 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి భక్తుల తలనీలాలు ద్వారా రూ.65 లక్షల 11 వేలు ఆదాయం వచ్చినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందా రెడ్డి తెలిపారు. గురువారం తలనీలాలకు జరిగిన వేలం పాటలో సికింద్రాబాదుకు చెందిన మదర్ హ్యూమన్ హెయిర్ ఎంటర్ ప్రైజస్ ప్రొప్రైటర్ ఆదినారాయణ పాటను దక్కించుకున్నారు. కార్యక్రమంలో చైర్మెన్ కావలి క్రిష్ణతేజ, పాలక మండలి సభ్యులు, దేవాదాయ శాఖ తనిఖీదారు రమణ, ప్రధాన ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి విజయానికి మరింత కృషి

- వైసిపి విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా కుళాయప్ప

ప్రజాశక్తి - వేంపల్లె



వైసిపి బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా కుళాయప్ప తెలిపారు. పార్టీ అధిష్టానం తన సేవలను గుర్తించి పదవి ఇచ్చిందన్నారు. తనకు విద్యార్థి విభాగంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైసిపి విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారిగా రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



సింహాద్రిపురం గ్రామానికి చెందిన యాగంటి రాఘవేంద్రరెడ్డిని వైసిపి విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారిగా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనమీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిక్కచ్చిగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తనకు పదవి బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డికి, వైఎస్ భాస్కర్‌రెడ్డికి, వైఎస్ మనోహర్‌రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

చెన్నారెడ్డి కాలనీలో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైయస్ మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం చెన్నారెడ్డి కాలనీలో వైసిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్రెడ్డికి, వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆ వార్డు కౌన్సిలర్ సహిద, వార్డు ఇంచార్జీ సిద్దయ్య, బూత్ కమిటీ సభ్యులు బాషా, వల్లి రామకృష్ణారెడ్డి, శ్యామ్‌సుందర్ నాయుడు, మధు, కమాల్ బాషా, విజయ్, ఖాదర్, బాబావలి పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థినులు చక్కగా చదివి ఉన్నతంగా ఎదగాలని మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్‌రెడ్డి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను రూ.4కోట్ల పాడా నిధులతో నిర్మించారు. గురువారం వైఎస్ మనోహర్‌రెడ్డి, పాడా ఓఎస్డి అనిల్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ ఆల్ గంగాధర్‌రెడ్డి, ఆ వార్డు కౌన్సిలర్ గాజుల శైలజ ప్రారంభించారు. తరగతుల గదులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చదువుల పట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. పేదవాడు కార్పొరేట్ విద్యను అందుకునేలా పాఠశాల రూపురేఖలను మార్చడమే కాకుండా నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరికి అందేలా చూస్తున్నారన్నారు. విదేశీ విద్యను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. బాగా చదువుకుంటూ ఉన్న స్థాయికి ఎదిగి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పురపాలక వైస్ చైర్మన్ హఫీజ్, హెచ్ఎం, రంగనాథ స్వామి మాజీ ఆలయ చైర్మన్ వెంకటసుబ్బయ్య, బలిజ సంఘం ఉపాధ్యక్షులు తోటంశెట్టి హరికృష్ణ రాయల్, గాజుల జయ, నూరుల్లా, చరణం పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, కౌన్సిల్ గాజుల శైలజ

రైతులకు అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులకు కావల్సిన కాంప్లెక్స్, డిఎపి ఎరువులు ఆయా గ్రామాల్లోని ఆర్బికెల్లో అందుబాటులో ఉన్నాయని ఎం వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని బొందలకుంట, తిమ్మాపురం, పెనికలపాడు ఆర్బికెలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎరువుల నిల్వ, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్టర్లు సక్రమంగా రాయాలన్నారు. ఎప్పటికప్పుడు రాయాలన్నారు. ఎరువుల ఏజెన్సీకి బకాయి పెండింగ్ లేకుండా చెల్లించాలన్నారు. ఎరువులు అమ్మిన ప్రతి రైతు వివరాలను డిబిటి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎరువులు నిల్వలు ప్రొడక్ట్ వారీగా ఉన్న స్టాక్ వివరాలను తెలిపి కావలసిన రైతులకు అందించాలన్నారు. ఆయా గ్రామాల్లోని ఆర్బికెల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఒ కోరారు.



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

సమగ్ర విచారణ జరిపించాలి : డివైఎఫ్ఐ



మాట్లాడుతున్నడివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

2018 గ్రూప్స్-1 పోస్టుల మెయిన్స్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో గురువారం శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ పూర్తి నిర్లక్ష్యమేనని తెలిపారు. ఇందుకు 2018 గ్రూప్స్ మెయిన్స్ రద్దు చేయాలని, మళ్లీ నిర్వహించాలని హైకోర్టు తీర్పు నిదర్శనమన్నారు. దాదాపు 49 వేల ఓఎంఆర్ షీట్లలో మూల్యాంకనం అవకతవకలు ఏర్పడ్డాయని అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మెయిన్స్ పరీక్షనే రద్దు చేసిందన్నారు. ఇంత పెద్ద కుంభకోణంలో పెద్దల హస్తం లేనిదే ఇలా జరిగి ఉండదన్నారు. కుటుంబాలకు దూరంగా కష్టపడి ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గి పరీక్షలు రాస్తే ఇలాంటి సంఘటనలు, చర్యలు నిరుద్యోగుల భవిష్యత్‌పై పడడం బాధాకరమన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని బాధ్యులను కఠినంగా శిక్షించాలని యువజన సంఘంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్, నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో ముందుకెళ్దాం

- మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఒక మంచి ఉద్దేశంతోనే చంద్రబాబు బిజెపి, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నారని టిడిపి పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బి టెక్ రవి) అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం బిజెపి, జనసేన పార్టీలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ ఈనెల 17న కూటమి సంయుక్తంలో చిలకలూరిపేటలో నిర్వహిస్తున్న సభకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ రాన్నారని, అక్కడ సభ నిర్వహించిన తర్వాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పతనం ఖాయమని అన్నారు. గతంలో పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగలేదన్నారు. ఈసారి అలా కాకుండా అందరం కలిసికట్టుగా కృషి చేసి ఓటరు తమ ఓటును వేసుకునేలా చేస్తామన్నారు. అన్ని ప్రణాళికలతో తాము కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డి, జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి హర్ష మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకటరామిరెడ్డి, మాజీ మార్కెట్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు తూగుట్ల సిద్ధారెడ్డి, రఘునాథరెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, రవితేజరెడ్డి, మాబాషా, బిజెపి నేతలు మహేశ్వర్‌రెడ్డి, సుష్మ, లక్ష్మయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం

ప్రజాశక్తి - చక్రాయపేట

తమకు ఒక్క సారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి పులివెందుల అభ్యర్థి బి టెక్ రవి సోదరుడు మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుప్పం పంచాయతీలో గురు వారం చిన్న మురయ్యగారిపల్లె, కొప్పల వాండ్లపల్లి, పోగులు వాండ్లపల్లె, బురుజుపల్లి, కాలనీ గ్రామాల్లో పర్యటించారు. టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప మండలాధ్యక్షుడు నరసింహులు, క్లస్టర్ ఇంచార్జిలు యోగేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్ కుమార్‌రెడ్డి, పరమేశ్వర, రమేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మహిళలకు అభివాదం చేస్తున్న నాయకులు

అందరిని కలుపుకొని టిడిపి జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అందరిని కలుపుకొని ప్రొద్దుటూరులో టిడిపి జండా ఎగరవేస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని ఆయన కార్యాలయంలో గురువారం యాన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అభ్యర్థిగా ఖరారు చేసినందుకు కృతజ్ఞతలుగా చంద్రబాబు, లోకేష్ బాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వరద మాట్లాడుతూ ఐవీఆర్‌యస్ కాల్స్ సర్వేలో ప్రజల మద్దతుతోనే తనకు టికెట్ వచ్చిందన్నారు. రాబోవు ఎన్నికల్లో టికెట్ కోసం నలుగురు వ్యక్తులు పోటీ పడ్డామన్నారు. సర్వే ప్రకారం చంద్రబాబు ప్రొద్దుటూరు టికెట్ తనకు కేటాయించారన్నారు. అందరిని కలుపుకొని ప్రొద్దుటూరులో ఖచ్చితంగా టిడిపి జెండా ఎగురవేస్తామన్నారు. సమిష్టి కృషితో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చేలా చేస్తామన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లుకు, జగన్మోహన్‌రెడ్డికి రాజకీయ సమాధి కడతామన్నారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, ఖాదరాబాద్ నాగమునిరెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిని కోరిన ప్రగతిశీల శాస్త్రవేత్త ఐన్‌స్టీన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రపంచ శాంతిని కోరిన ప్రగతిశీల శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అని జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు అన్నారు. జనవిజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఐన్‌స్టీన్ జయంతి కార్యక్రమాన్ని గురువారం స్థానిక గౌతమ్ ఉన్నత పాఠశాల, గోపీకృష్ణ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐన్‌స్టీన్ చిన్నతనం నుండి తనకు ఉన్న క్యూరియాసిటీతో శాస్త్రవిజ్ఞానంపై ఇష్టాన్ని పెంచుకున్నారని, భౌతిక శాస్త్రంలో అసాధారణ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. 1905లో కాంతి అణువుల ఉనికి సాపేక్ష సిద్ధాంతాలపై ఆయన చేసిన కృషి వల్ల సౌన్స్ పురోగమనం చెందిందన్నారు. ఈనాడు మనకు అందుబాటులో ఉన్న టివి, జిపిఎస్ న్యూక్లియర్ పవర్‌ప్లాంట్స్, లేజర్, అంతరిక్షయానం, డివిడి ప్లేయర్లు వంటి అనేక అంశాలు ఆయన సిద్ధాంత ఫలితాలే అన్నారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆయన జర్మనీ నుండి అమెరికాకు వలస వెళ్లారని, యుద్ధానికి వ్యతిరేకంగా ఆయన అనేక ప్రసంగాలు చేశారన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్బయ్య, జెవివి నాయకులు కిరణ్ మాట్లాడారు. మ్యాజిక్ ద్వారా అశాస్త్రీయ భావాల వ్యాప్తిని అరికట్టే విధానాన్ని ప్రదర్శన ద్వారా చూపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ప్రియాంక, ఆయా పాఠశాలల అధికారులు ఫణిమాధవ్, గంగయ్య, గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సుబ్బరాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తవ్వా సురేష్



కుమారకాలవలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎస్‌పి

ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు వేయాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశిల్ పేర్కొన్నారు. మండలంలోని ఎర్ర బొమ్మనపల్లె, కుమార్ కాలువ పంచాయతీల బూత్‌లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఓటర్లను కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఎన్నికల్లో దౌర్జన్యాలు చేసిన వారిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ గోవింద్‌రెడ్డి, ఎస్ఐ వినోద్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఒత్తిడికి గురి కాకుండా మానసిక ప్రశాంతతో పరీక్షలకు సన్నద్ధం కావాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం రవీంద్రనాథ్ హైస్కూల్, సత్రం స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష పాడ్, పెన్నులను కోలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన చేతుల మీదుగా కోలా ప్రసాద్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక ప్రణాళిక బద్ధంగా చదివి పరీక్షలు రాసి విజ యం సాధించాలన్నారు. జీవితంలో ఉన్నత శిఖ రాలు అధిరోహించాలంటే మనకు వచ్చే పరీక్ష ఫలితాలే కారణమన్నారు. ఉద్యోగం సాధించడం వల్ల మనకు విలువలు పెరుగుతాయని ఆయన వివరించారు. అనంతరం ప్యాడ్స్, పెన్నులు అం దించిన కోలా ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, కోలా యువసేన పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పుపాలక సంఘం మెప్మా ద్వారా ప్రొద్దుటూరు రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహం (నైట్‌షెల్టర్)ను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా టిఈకె కెజియా జాస్మిన్ కోరారు. యుహెచ్‌సి-2 డాక్టర్ హిమబిందుతో కలసి గురువారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ డిస్పెన్సరీని కెజియా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరాశ్రయులెవరు కూడా రోడ్లపై నివసిస్తూ అనుకోని ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు ఈ వసతి గృహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. చల్లటి, వేడి, శుద్ధి నీరు లభిస్తుందన్నారు. డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ వసతి గృహంలో ఉన్నవారు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు దేవదాసు మాట్లాడుతూ వసతి గృహంపై ప్రత్యేకశ్రద్ధ చూపుతున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ దినేష్, వైద్య, నైట్ షెల్టర్ సిబ్బంది పాల్గొన్నారు.



వాటర్ డిస్పెన్సరీని ప్రారంభిస్తున్న అధికారులు



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వైఎస్ఆర్ చేయూత పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలానికి సంబంధించి 4వ విడత వైయస్సార్ చేయూత పథకం కింద 1901 మంది లబ్ధిదారులకు రూ.18,750 చొప్పున వారి ఖాతాల్లో జమ కానున్నట్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు మహిళలకు మెగా చెక్కును అందజేశారు. స్థానిక ఎస్వీ కల్యాణమండపంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారితకు ప్రాధాన్యతనిస్తూ పెద్దపీట వేస్తోందన్నారు. వైఎస్ఆర్ చేయూత పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిం దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పిటిసి బాలయ్య, ఎంపీడీవో జాషువా, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, సర్పం చులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వెలుగు, మెప్మా, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొండాపురం : మండల కేంద్రమైన కొండాపురంలో స్థానిక రాఘవేంద్ర స్వామి కల్యాణమండపంలో నాలుగో విడత వైయస్సార్ చేయూత నిధులను మంజూరు చేశారు. ఎంపీపీ లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా చేయూతను అందిస్తూ, వారి బ్యాంకు ఖాతాలో డబ్బులను జమ చేశారన్నారు. మండలంలో 1970 మందికి మూడు కోట్ల 69 లక్షల రూపాయలు మంజూరు అయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ మన జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి ఎంపీడీవో నాగప్రసాద్, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, అల్లం సత్య, ప్రవీణ్, బుజ్జి, కృష్ణయ్య యాదవ్, శేఖర్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి - ముద్దనూరు

మహిళల హక్కుల కోసం ఎపి ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని మండలశాఖ అధ్యక్షులు బాల ఓబయ్య అన్నారు. మండలంలోని పెనికలపాడు గ్రామంలో గురువారం చలో విజయవాడ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆరవ సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధి మరిచి ఎండమావిలో నీటిని చూపిస్తూ మహిళలను మోసం చేస్తూ మాటలకు మాత్రమే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఆరవ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని మహిళలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జయరాముడు, శీను, రమణయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

మట్టి ముంత ఇచ్చి, వెండి చెంబులాక్కున్నట్లుంది వైసిపి వాలకం

ప్రజాశక్తి - వేంపల్లె

మట్టి ముంత ఇచ్చి వెండి చెంబు లాక్కున్నట్లుంది వైసిపి ప్రభుత్వ వాలకమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రజలకు ఇచ్చింది గోరంత కాగా వివిధ మార్గాల ద్వారా ప్రజల నుండి లాక్కున్నది కొండంత అన్నారు.

జనసేన బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజక వర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేయడమే తమ ముందున్న లక్ష్యమని జనసేన జమ్మలమడుగు కో-ఆర్డినేటర్స్ నల్లంసెట్టి నాగార్జున, దేరంగుల జగదీష్ తెలిపారు. గురువారం జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అలంకార్ ఫంక్షన్ హాల్‌లో సభను నిర్వహించి కేక్ కట్ చేశారు. కొండాపురం మండలంలోని పదకొండు కుటుంబాలు స్వచ్ఛందంగా వచ్చి జనసేనలో చేరడంతో వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కొండాపురం, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగులోని జనసేన నాయకులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇంటి యజమాని రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంటిలోని టీవీ, ఫ్రిడ్జ్, దుస్తులు, ఫ్యాన్లు, కుర్చీలు, మంచాలతో సహా ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయని వాపోయాడు. కుటుంబ అవసర నిమిత్తం తెచ్చి పెట్టుకున్న రూ.2 లక్షల నగదు కూడా కాలిపోయిందని కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. స్థానిక వీఆర్వో వేణు సంఘటన స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీసి, కాలిన వస్తువులను నమోదు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటి యజమాని రామ్మోహన్ ఆర్టిపిపిలో దినసరి కూలీగా, భార్య నారాయణమ్మ వాలంటీర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న వీఆర్వో వేణు

క్రైం కార్నర్

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని ఆంజనేయ కొట్టలు గ్రామానికి చెందిన రైతు బీజం కృష్ణారెడ్డికి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండుగులు ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను తీసుకెళ్లారు. ఆ మేరకు బాధిత రైతు గురువారం వాపోయారు. వరి పంటను సాగు చేశానని, ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని రైతు ఆవేదన వ్యక్త పరిచారు.

సింహాద్రిపురం : మండలంలోని వై.కొత్తపల్లిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్‌ను దుండగులు అపహరించారు. గురువారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన రైతు ముకుంద రెడ్డి పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మెయిన్ లైన్ వైరు కట్ చేసి, కాపర్ వైర్లు, అల్యూమినియం కోర్ దొంగలించారు. వీటి విలువ దాదాపు రూ.80 వేలు ఉంటుందని విద్యుత్ శాఖ ఎఇ సుబ్రమణ్యం తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి చోరీలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.



పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందపడేసిన దుండగులు